క్లుప్తంగా

'ఆర్థిక పరమైన తేడాను సరి చేయాలి'

ధర్మసాగర్: నవంబర్ 30వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించిన అధికారులకు ఆర్థిక పరమైన తేడాలు వచ్చాయని, వాటిని సరి చేయాలని టీబీఈఎస్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రాజన్న శనివారం ప్రకటనలో కోరారు. ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులకు ఇచ్చే రెమ్యూనరేషన్ తక్కువ అయినప్పటికీ అందులో తేడాలు ఉండడం శోచనీయమని తెలిపారు. వివిధ నియోజకవర్గాల్లో విధులు నిర్వహించిన రిటర్నింగ్ ఆఫీసర్లు గమనించి ఆర్థిక పరమైన తేడాను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

'గండ్ర' గెలవాలని ప్రత్యేక పూజలు



శాయంపేట : నేడు వెలువడనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో భూపాలపల్లి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి భారీ మెజారిటీతో గెలవాలని వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి శనివారం శ్రీబుగులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీబుగులోని వెంకటేశ్వర స్వామి కృపాకటాక్షంతో భారీ మెజార్టీతో గెలవాలని ఆమె ఆకాంక్షించారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రాజోలు రాజవీరు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా శనివారం సూర్యోదయ ట్రస్ట్ చైర్మన్ కనకం జయసూర్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా 50 కేజీల బియ్యం, రూ. 2వేల విలువగల నిత్యావసర సామాగ్రిని అందించారు. కోమనేని రఘు, అమ్మ అశోక్, ఉమేష్ ఉన్నారు.

10న పడిపూజ, మహాన్నదానం



ఖిలా వరంగల్: అయ్యప్ప సేవా సమితి, అయ్యప్ప పరపతి సంఘం, హరిహర పుత్ర పరపతి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10న వరంగల్ – ఖమ్మం రహదారిపై ఉర్సు సుభాష్‌నగర్‌లోని నాగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప పడిపూజ, మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బత్తిని సుభాష్‌గౌడ్ తెలిపారు. 20వ సంవత్సరం పూడిపూజ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అయప్ప మాలధారులతో కలిసి ఆయన పడిపూజ వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. 10వ తేదీ ఉదయం 4.30గంటలకు సుప్రభాతం, 5గంటలకు గణపతి పూజ, సంకల్పం, 5.30గంటలకు గణపతి నవగ్రహ హోమం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందని వివరించారు. 9.30 గంటలకు శరణుఘోష, 10.30 గంటలకు పూడిపూజ, 11.30 గంటలకు పంచామృత అభిషేకాలు, మధ్యాహ్నం 1.30 గంటలకు పదునెట్టంబడి, జ్యోతి ప్రజ్వలన అనంతరం మహాన్నదానం ఉంటుందని తెలిపారు. అయ్యప్ప పూడిపూజకు భక్తులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని సుభాష్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో మాలధారులు పాల్గొన్నారు.

రక్తదానం.. సామాజిక బాధ్యత



మామునూరు: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని, సామాజిక బాధ్యత అని, ఈక్రమంలో రక్తదానం చేసేందుకు యువత, విద్యార్థులు ముందుకు రావాలని వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్‌యాదవ్ సూచించారు. 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో ఫార్మసీ అధ్యాపకుల ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ సహకారంతో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్ యాదవ్ మాట్లాడారు. విద్యార్థులు సేవాభావంతో ముందుకు వచ్చి రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడిన వారవుతారని చెప్పారు. రెడ్ క్రాస్ సంస్థ వైద్యుల పర్యవేక్షణలో మోటివేటర్ శ్రీనివాస్ బృందం సభ్యులు సుమారు 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- మండలాల్లో 144సెక్షన్ అమలు
- విజయోత్సవాలకు అనుమతి నో..
- హెచ్చరికలు జారీ చేసిన పోలీస్‌లు

ఎల్కతుర్తి: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ఆదివారం జరగనుంది. ఈ నేపథ్యంలో మండలంలో 144సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ర్యాలీలు, బాణసంచా పేల్చేందుకు అనుమతి లేదని తెలిపారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ర్యాలీలు తీయడం, బాణసంచా పేల్చడం వంటి సంబురాలు చేయొద్దని తెలిపారు. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాజకీయ పార్టీలు నిబంధనలు పాటించాలి

దామెర: రాజకీయ పార్టీ నాయకులు నిబంధనలు పాటించాలని ఎస్సై ముత్యం రాజేందర్ శనివారం ప్రకటనలో కోరారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలో 144సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు విజయోత్సవ ర్యాలీలు, వేడుకలు నిర్వహించొద్దని తెలిపారు.



శాయంపేట : ఎస్సై దేవేందర్

బాణసంచా కాల్చడం, డీజే సౌండ్, ర్యాలీలు చేయవద్దని సూచించారు. గుంపులుగా తిరగడం, బైక్ ర్యాలీలు నిర్వహించడం, సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం నిషేధమని పేర్కొన్నారు. గెలిచినా, ఓటమి చెందినా అందరూ సంయవనం పాటించాలని, గొడవలు చేయకుండా సోదరభావంతో మెలగాలని కోరారు. నిబంధనలు పాటించని వ్యక్తులపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మండలంలో 144 సెక్షన్ అమలు

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడుతున్న నేపథ్యంలో మండలంలో 144సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై దేవేందర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏ పార్టీ గెలిచినా అందరూ స్నేహభావంతో ఉండాలని, ఎలాంటి గొడవలు సృష్టించొద్దని సూచించారు. మండలంలో విజయోత్సవ ర్యాలీలు, డీజేలు, బాణసంచా పేల్చడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేదన్నారు. రోడ్లపై నలుగురికి మించి గుమికూడొద్దని, ఫలితాలు వెలువడిన 24 గంటల అనంతరం అనుమతి తీసుకొని సంబరాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం

ధర్మసాగర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడనున్న నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతులు లేవని సీఐ శ్రీధర్ రావు శనివారం ప్రకటనలో తెలిపారు. మండలంలో 144సెక్షన్ అమలులో ఉన్నందును నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడరాదని తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఎలాంటి సభలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసనలు చేయొద్దని సూచించారు. పోలీస్‌శాఖ సూచనలు పాటించకుండా ఎవరైనా విజయోత్సవ కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు పాటించాలని కోరారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

దామెర: అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించొద్దని ఎంపీపీ కాగితాల శంకర్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో భాగంగా అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానమిచ్చారు. మండలంలో ఏర్పాటు చేసిన వైకుంఠదామాల్లో 50శాతం విద్యుత్ పనులు పూర్తి చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ గుర్రం రమేష్ తెలిపారు. పలు గ్రామాల్లో నూతన డీటీఆర్‌లు, స్తంభాలు మంజూరు అయ్యాయని, వాటిని త్వరలోనే బిగిస్తామని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అయ్యాయని, పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని పీఆర్ డీఈ లింగారెడ్డి వెల్లడించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివద్ధికి కృషి చేయాలని అన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కల్పనకృష్ణమూర్తి, ఎంపీడీఓ కాసర్ల రవీందర్, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీలు గండు రాము, సంగరబోయిన మౌనికకిరణ్, సంధ్యఅశోక్, వివిధ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న హైమావతి



కాజీపేట: మాట్లాడుతున్న కవిత

కాజీపేట అర్బన్: ఆపదలో ఉన్న మహిళలు సఖి వన్ స్టాప్ సెంటర్ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పేర్వారం హైమావతి తెలిపారు. హన్మకొండ ఎక్సైజ్‌కాలనీలోని సఖి వన్ స్టాప్ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సఖి వన్‌స్టాప్ సెంటర్ 24 గంటలు పనిచేస్తున్నదని, అవసరమైన మహిళలు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే సేవలందిస్తారని చెప్పారు. శారీరక, మానసిక, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న మహిళల సమస్యల పరిష్కారంతో పాటు తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధిత మహిళలకు అండగా సఖి

కాజీపేట: వేధింపులకు గురవుతున్న బాధిత మహిళలు, బాలికలకు సఖి సెంటర్ అండగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత తెలిపారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినట్లతే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే సఖి కేంద్రానికి సమాచారం అందించి తక్షణ రక్షణ కల్పిస్తామని చెప్పారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లకు సఖి వన్‌స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో సఖి సేవలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విడిపోయే ఆలోచనల్లో ఉన్న భార్యాభర్తలకు కౌన్సెలింగ్, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, తదితర సమస్యలకు సఖి సెంటర్‌లో ఉచిత సేవలు అందించనున్నట్లు వివరించారు. బాధిత మహిళలు, బాలికలు 181 లేదా 0870 – 2452112 నంబర్‌కు ఫోన్ చేసి తక్షణ రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ వినీల, లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మొక్క నాటుతున్న హెచ్‌ఎం, విద్యార్థులు

హసన్‌పర్తి: కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలని ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు పిలుపునిచ్చారు. నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డే కార్యక్రమాన్ని హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 15 అత్యంత కాలుష్య నగరాల్లో 12 దేశంలోనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యం సంక్లిష్ట సమస్యగా తయారైందని వాపోయారు. ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది మరణాల్లో ఒకరు వాయుకాలుష్యం వల్ల మరణిస్తున్నారని వివరించారు. వాయు కాలుష్యం వల్ల ఢిల్లీ నగరంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రకృతిని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. రాబోయే తరానికి పర్యావరణాన్ని అందించాలని, చెట్లు, మొక్కలను కాపాడాలని సూచించారు. యువకులు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజారోగ్యం, పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతిఒక్కరూ నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు.

బిట్స్‌లో నేషనల్ పొల్యూషన్ డే

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో నేషనల్ పొల్యూషన్ డే కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిట్స్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్బన పదార్థాలు ఎక్కువ వాడటం వలన వాతావరణంపై ప్రభావం చూపుతుందని సూచించారు. వివిధ విభాగాధిపతులు మనీష్, రవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కళాశాలలో నేషనల్ పాపులేషన్ డే పై అవగాహన సదస్సు నిర్వహించారు. అధిక జనాభా వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీదే అధికారం



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న కరుణాకర్

ఎల్కతుర్తి: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు గెలిచి అధికారంలోకి వస్తుందని, హుస్నాబాద్ నియోజకవర్గంలో పొన్నం ప్రభాకర్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ఆపార్టీ జిల్లా నాయకుడు పచ్చునూరి కరుణాకర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ 20వేల మెజారిటీతో గెలుస్తారని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 68నుంచి 76సీట్లు కైవసం చేసుకొని అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తెలంగాణ ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువకులు, మహిళలతో పాటు మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటేసి ఇందిరమ్మ రాజ్యం రావాలని కోరుకున్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు సదానందం, వెంకటేశ్వర్లు, కమలాకర్, రామారావు, రాకేష్, సుధీర్, కుమార్ పాల్గొన్నారు.



పరకాల : మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

పరకాల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు పరకాల నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలుస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని స్వర్ణ గార్డెన్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నవంబర్ 30న జరిగిన పోలింగ్‌లో ప్రజల నాడీని పరిశీలిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఊహించని వ్యతిరేకత కనిపించిందన్నారు. ఎంతో కాలంగా బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు ఎదురుచూశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, పరకాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తన గెలుపు కోసం కృషి చేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. పీసీసీ సభ్యుడు దొమ్మాటి సాంబయ్య, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్ జయమ్మ, చందర్, శ్రీనివాస్, రాంమూర్తి పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి



పోలీసు కిష్టయ్య చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మెపా నాయకులు

హన్మకొండ: తెలంగాణ మలిదశ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం అమరుడైన పుట్టకొక్కుల కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) ఆధ్వర్యంలో నిర్వహించారు. హనుమకొండలోని మెపా కార్యాలయంలో కిష్టయ్య చిత్రపటానికి అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి శుక్రవారం రాత్రి నివాళులర్పించారు. మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరుడు పోలీస్ కిష్టయ్య అని కొనియాడారు. రాష్ట్రంలో రానున్న నూతన ప్రభుత్వం.. కిష్టయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని, ట్యాంక్ బండ్‌పై కిష్టయ్య విగ్రహం నెలకొల్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్, నాయకులు రామకృష్ణ, నీరటి రాజు, అమ్మగారి రాకేష్ వర్మ, గొనెల శ్యామ్, ఈరబోయిన రాకేష్, ఈరబోయిన రోహిత్, దువ్వ దిలీప్, రావుల ప్రశాంత్, అమ్మగారి మోహన్, వినోద్, చేతన్ వర్మ, శ్యామ్, రావుల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న దాతలు

కమలాపూర్: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన బాలసాని శ్రీనివాస్‌గౌడ్-రమాదేవి దంపతులు వారి కుమారుడు సిద్దార్థ పుట్టిన రోజు సందర్భంగా అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారు స్వాములకు భిక్ష వడ్డించారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ కుటుంబ సభ్యులు రిషిత, లత, కల్యాణి, గురుస్వాములు పెరుమాండ్ల సమ్మయ్య, దుండుకూరి రాజు, నేరెళ్ల అశోక్, రాజయ్య, రామగిరి శ్రీధర్, పచ్చిమట్ల రాజయ్యగౌడ్, జక్కు కృష్ణమూర్తిగౌడ్, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

మలుపులు.. మృత్యు పిలుపులు

- ప్రమాదాలకు నిలయంగా సోమిడి – టేకులగూడెం రోడ్డు
- ఏర్పాటు చేయని హెచ్చరిక బోర్డులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు



ప్రమాదకరంగా ఉన్న టేకులగూడెం క్రాస్‌రోడ్డు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి నుంచి టేకులగూడెం గ్రామం వైపు వెళ్లే రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారినపడి తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ దారిలో నిత్యం ఏదో ఒకచోటు రోడ్డు ప్రమాదం జరుగుతోంది. ఈక్రమంలో ఆ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు, ప్రయాణికులు భీతిల్లుతున్నారు.

కానరాని హెచ్చరిక బోర్డులు

మూలమలుపును అంచనా వేయకుండా వేగంగా వెళ్లే ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. దాంతో అనేక మంది తీవ్ర గాయాలపాలై ఆర్థికంగా నష్టపోతున్నారు. సుబ్బయ్యపల్లె క్రాస్ రోడ్డు, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల, తాళ్లరేవు, గూడెంక్రాస్ రోడ్లు ప్రమాదకరంగా తయారయ్యాయి. అధికారులు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, స్పీడ్‌బ్రేకర్లు వేయకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



సోమిడి – గూడెంరోడ్డులో అనేక మలుపులు ఉన్నాయి. వాటివద్ద రేడియంతో కూడిన హెచ్చరిక బోర్డులు పెట్టించాలి. దాంతో కొంతవరకైనా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు. అలాగే స్పీడ్ బ్రేకర్లను కూడా ఏర్పాటు చేయాలి. ఈక్రమంలో వాహనదారులకు రోడ్డు పరిస్థితి అవగతమవుతుంది. లేకుంటే రోజు ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. అధికారులు స్పందించాలి.

– పెసరు రాజు, సోమిడి

పురుగు మందు డబ్బాతో నిరసన



పురుగు మందు డబ్బాతో భైఠాయించిన రైతు

ఎల్కతుర్తి: రోడ్డు నిర్మాణంలో భాగంగా కల్వర్టు నిర్మించాలని ఓ రైతు పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై భైఠాయించి ఆందోళనకు దిగిన సంఘటన భీమదేవరపల్లి మండలం ముస్తాఫాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్లనర్సింగాపూర్ నుంచి కొత్తకొండకు నూతన రహదారి నిర్మాణం పనులు కొన్ని రోజులుగా జరుగుతున్నాయి. ముస్తాఫాపూర్‌కు చెందిన రైతు ఏనుగు సుధాకర్‌రెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కొన్ని రోజులుగా కాంట్రాక్టు బాధ్యులకు చెబుతూ వచ్చాడు. వారు పట్టించుకోకపోవడంతో ఆవేదనకు గురైన సదరు రైతు పురుగల మందు డబ్బాతో రోడ్డుపై భైఠాయించి నిరసనకు దిగాడు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తన వ్యవసాయ పొలం వద్ద గతంలో కల్వర్టు ఉండేదని, రోడ్డు పనుల్లో కూలిపోయిందన్నారు. వర్షాకాలం వరద వస్తే పొలం పూర్తిగా మునిగిపోయి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. కల్వర్టు నిర్మాణం చేపట్టకపోతే పురుగుల మందే శరణ్యమని అక్కడే భీష్మించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతు సుధాకర్‌రెడ్డి ఆందోళన విరమించాడు. వెంటనే తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ బాలిక పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ముగిసిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన బీ.శ్రీహర్షిణి, ప్రణతి పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల పధానోపాధ్యాయురాలు బీ.సుమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను వారు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్‌కుమార్, కరాటే మాస్టర్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'అజర'లో ఉచిత వైద్యసేవలు



ఎంజీఎం: ములుగురోడ్డులోని అజర ఆస్పత్రి నాలుగవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హాస్పిటల్‌లో ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ బీ.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. ఆస్పత్రిలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4నుంచి 17వ తేదీ వరకు వారం రోజుల పాటు ఉచిత కన్సల్టేషన్, రక్త, మూత్ర, గుండె పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు, డైటీషన్ కన్సల్టేషన్, పాప్‌స్మీర్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు వివరించారు. పలు విభాగాలకు చెందిన వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే, ఆస్పత్రిలో ఉన్న రోగులకు పలు రకాల శస్త్రచికిత్సలపై ప్రత్యేక తగ్గింపు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత వైద్య సేవల అవకాశాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.